==================================================================
Language in India www.languageinindia.com ISSN 1930-2940 Vol. 19:12 December 2019
==================================================================

# The Language- Orthography in Mackenzie Kaifiyats

**DR. KOLLETI RAVIBABU**
**297, Doyens Colony, Serilingampalli**
**Hyderabad -500019, Telangana**
**kolletiravi@gmail.com**

=================================================================

**SUMMARY OF THE ARTICLE**

Village Local Record is called 'Local history ' or 'Village history ' in Telugu. Between 1793-1816, Mackenzie collected Kaifiyats (Arabic word for records) when he was Surveyor General in South India during the East India Company. These are called Mackenzie Kaifiyats because these were collected by Mackenzie. They are useful in determining the historical, geographical, social, cultural and linguistic features of villages. After British came to power in India, that is, since 18th century, they used colloquial style language for Revenue, Police, and Law, etc.

## Language Structure

Inscriptions in Telugu land are most important to know the structure of Telugu language. Yet, the language of the inscriptions is not necessarily a contemporary language. The language of the inscriptions is also limited to the limited purpose of the administrative language. Kaifiyats are written by karanas (traditional accountants/record keepers) and villagers so it became local language. In all administrative affairs, there are many words and non-native words that may not be understood now. For these reasons, it is said that the Telugu language has become a modern tongue and that Mackenzie started it with Kaifiyats. McKenzie's is very similar to the scriptural approach to the laws of the Kaifiyats. By observing phonemic and morphemic distribution, meanings, etc., from the scientific viewpoint of the Kaifiyats, we can understand the orthographic changes in language.

## Languages and Orthographic Changes

Inscriptions and Kaifiyats are the main sources to understand the Evolution of Telugu Language. In the Kaifiyats we can see the language used in village administration particularly revenue, agricultural and cultural language. From the second half of the nineteenth century,

we can find the changes in the writing of language because of modern education system. We can find 15 types of Orthographic changes in Kaifiyats.

The aim of this paper is to study these Orthographic changes in the Telugu language.

===============================================

# మెకంజీ కైఫియత్తుల్లో భాష - లేఖన పద్ధతులు


**డా।। కొల్లేటి రవిబాబు**

**297, డోయెన్స్ కాలనీ, శేరిలింగంపల్లి**

**హైదరాబాదు- 500019, తెలంగాణ**

**Email: kolletiravi@gmail.com**

**సెల్: 9494398884**


===============================================

కైఫియత్ (Village Local Record) అనే పారశీక పదాన్ని తెలుగులో 'స్థానికచరిత్ర' లేదా 'గ్రామచరిత్ర' అని పిలుస్తున్నాం. 1793 - 1816 ల మధ్యకాలంలో మెకంజీ ఈస్టిండియా కంపెని పాలనా కాలంలో దక్షిణ భారతదేశంలో సర్వేయర్ జనరల్ గా ఉన్నప్పుడు కైఫియత్తులు సేకరించాడు. వీటిని మెకంజీ సేకరించడం వలన మెకంజీ కైఫియత్తులు అని పిలుస్తున్నారు. గ్రామాలకు సంబంధించిన చారిత్రక, భౌగోళిక, సామాజిక, సాంస్కృతిక, భాషా విశేషాలు తెలుసుకోవడానికి ఇవి ఉపయోగపడుతాయి.

## భాషా స్వరూపం

తెలుగు భాషా స్వరూపాన్ని తెలుసుకోవడానికి శాసనాలు ప్రధానమైనవి. అయినప్పటికీ శాసనాల్లోని భాష అంతా సమకాలీనమైనదని అనలేం. శాసన భాషకి పరిమితమైన ప్రయోజనం ఉండటం వలన శాసనాలలోని భాషా స్వరూపం కూడా పరిమితంగానే ఉంటుంది. కైఫియత్తులని కరణాలు, గ్రామస్తులు రాయడం వలన అవి అప్పటి స్థానిక వ్యవహార భాషలో ఉన్నాయి. పాలనా సంబంధమైన అన్ని వ్యవహారాలలో అప్పటి వాడుకలో ఉండి ఇప్పుడు అర్థంకాని ఎన్నో పదాలు, అన్యదేశ్య పదాలు వ్యవహారంలోకి ప్రవేశించాయి. ఈ కారణాల వలన తెలుగు భాష ఆధునిక స్వరూపంలోకి మారడం మెకంజీ కైఫియత్తులతో ప్రారంభమైనట్లని చెప్పవచ్చు. మెకంజీ కైఫియత్తులలోని లేఖన విధానానికి శాసనాలలోని లేఖన విధానానికి సారూప్యం ఉంది. కైఫియత్తులలో భాషని శాస్త్రీయ దృష్టితో వర్ణనాత్మక పద్ధతిలో పరిశీలించడం వలన వర్ణ స్థాయి, పద స్థాయిలలోని లేఖన పద్ధతులు తెలుస్తాయి.

## 1. లేఖన పద్ధతులు (orthography)

మెకంజీ కైఫియత్తుల(18వ శ.)లో లిఖితరూపంలో ఉన్న భాషను పరిశీలించడం ద్వారా లేఖన పద్ధతులు, ధ్వనిపరిణామం తెలుస్తాయి. కైఫియత్తులలోని భాషకు ఆ కాలానికి చెందిన శాసనాలలోని భాషకు సారూప్యం ఉంది. కైఫియత్తులలో కొన్ని శాసనాల

నకళ్లు కూడా ఉన్నాయి. కాబట్టి రెండింటిలోని భాషా లక్షణాలను సమన్వయం చేయవచ్చు. కైఫియత్తులలోని భాష ఆ కాలంనాటి వ్యవహారంలోని భాష అని చెప్పలేము. దానిలో గ్రాంథిక భాషారూపాలు, వాడుక భాషారూపాలు కలగాపులగంగా ఉంటాయి. అది కావ్యేతర రచనావ్యవహారాలకు అంటే సామాజిక వ్యవహారాలకు లిఖితరూపంలోని భాషాశైలి. ఇది రాయవాచకంలోని భాషాశైలిని పోలి ఉంటుంది. 19వ శతాబ్ది ఉత్తరార్థం నుంచి ఆధునిక విద్యావవస్థ స్థిరపడుతూ వచ్చింది. అందుచేత రచనాభాషలో మార్పు కనిపిస్తుంది. 20వ శతాబ్ది ఆరంభం నుంచి ఆధునిక లిఖిత భాషారూపం రూపొందుతూ వచ్చి 20వ శతాబ్ది ఉత్తరార్థానికి ఆధునిక ప్రామాణిక రూపం ఏర్పడినట్లు చెప్పవచ్చు. అయినా కైఫియత్తులలోని భాష దస్తావేజులు వంటి రచనల్లో కొనసాగుతూ వస్తోంది. దీనిని ప్రత్యేకంగా పరిశీలించవలసిన ఆవశ్యకత ఉంది. ప్రస్తుత పరిశీలనలో లేఖన పద్ధతుల ద్వారా ఈ కింది అంశాలు తెలుస్తున్నాయి.

### 1.1. లేఖ్యాక్షర సంకోచం

కొన్ని పదాలలో అచ్చును లోపింపచేయడం చేత అక్షరసంకోచం ఏర్పడుతుంది. ఇది కైఫియత్తుల లేఖనంలో విస్తారంగా ఉంది. ఇప్పటి దస్తావేజులు వంటి వాటి రాతలో 'గార్కి' వంటి రూపాలు పూర్వపు లేఖన పద్ధతికి కొనసాగింపు. నాల్గు (నాలుగు), కల్గి (కలిగి) వంటివి ఛందస్సుకోసం పద్యకవిత్వంలో ప్రయోగించడం ఉంది. 'ఎన్మిది, పద్మూడు' వంటి కొన్ని పరిమిత పదాలు మాండలిక స్థాయిలో కూడా ఉన్నట్లు చెప్పగలం. కానీ కైఫియత్తులలోని ఎక్కువ పదాలు ఉచ్చారణతో సంబంధం లేనివే. ఇది ఒక లేఖన పద్ధతిగా ఏర్పడిపోయిందని ఉచ్చారణకు సాధ్యంకాని చ్న (చిన), స్కల (సకల) వంటి రూపాల ద్వారా చెప్పవచ్చు. ఈ లేఖన విధానం 17, 18 శతాబ్దాల శాసనాలలో ఉండడం" (రంగనాథాచార్యులు. 2010: 168) ద్వారా దీనిని కావ్యేతర రచనల లేఖన పద్ధతిగా గుర్తించవచ్చు.

ఉదా: వర్కు (శ్రీ.18), గార్కి (పగో.2), వెన్క (విజయ.4), తెల్పు , (గు.2.1), చెర్కు (కర్నూలు.13), చద్వ (చో.30). ఇదేవిధంగా పన్స, అడ్వి, శల్వ, చెర్వ, కొడ్కు, నాల్గు, మొదలైనవి కైఫియత్తులలో ఉన్నాయి.  ఈ కిందివి అచ్చును లోపింపజేసినవే కానీ ఉచ్చారణను బట్టి ప్రకటించే పదాలని చెప్పలేము.

ఉదా: త్న, త్మ (పగో.1,5), ల్కె (శ్రీ.18), పయ్కి (గు.1.26), యిదిగ్కా, యాయ్నకు మొదలైనవి.

### 1.2. ద్విత్వానునాసికం ముందు పూర్ణబిందువు

ద్విరుక్త అనునాసికాలకు ముందు పూర్ణానుస్వారంతో ఉన్న రూపాలతోపాటు లేని రూపాలు కూడా ఉన్నాయి. కైఫియత్తుల భాషలో అనుస్వారం ఉన్న రూపాలే ఎక్కువగా ఉన్నాయి. ఇది పూర్వాచ్చు ఆనునాసిక్యానికి చిహ్నం కావచ్చునని ఊహింపబడింది" (రంగనాథాచార్యులు. 2010:169).

ఉదా: హెంబన్ను (పగో.1), గ్రామముంన్ను (గు.1.1), తెలిసికొన్నాడు (విజయ.4,5), దంమ్మన్నగారు, వుండుకున్న, మెముంన్ను, కత్తిన్నర (కృ.3), సూరంన్న, సూరన్న, వున్నారు, నిన్ను(పగో.2,3), వృత్తులకుంన్ను మొదలైన ప్రయోగాలు కైఫియత్తులలో కనిపిస్తున్నాయి.

## 1.3. పూర్ణబిందువు తరువాతి హల్లుకు ద్విత్వం

తెలుగులో అనుస్వారం స్పర్శ వర్ణాల ముందే ఉంటుంది. ఇది లేఖనంలో నిండు సున్నతో ప్రకటితమౌతుంది. శాసనాలలో నియతంగా కాకపోయినా, హల్లును పూర్ణబిందువు తర్వాత ద్విత్వంతోనూ, అర్ధబిందువు తర్వాత అద్విరుక్తితోనూ రాయడం కనిపిస్తుంది. క్రమంగా లిఖిత ప్రతులలో అర్ధానుస్వారం లేకపోయినా పూర్ణానుస్వారానికి ఇదే విధానం కొనసాగింది. (శ్రీరామరాజు.1996:39). కైఫియత్తులలో పూర్ణబిందువు తరువాతి హల్లు ద్విత్వంతోనే ఎక్కువగా ఉంది. అద్విరుక్తి ఉన్న ఉదాహరణలు తక్కువగానే ఉన్నాయి. అర్ధానుస్వారం లేదు.

ఉదా: అంత్తట, వుండిరి (విజయ.4), కుంట్ట, వుండ్డ, కింద్ద (పగో.5), కట్టించ్చి (గు.1.1), అంద్దుకు (గు.2.13), వుంచ్చేది, వుంచేది (కర్నూలు.43), సాధించ్చి, నంద్దన, సంవ్వత్సరం (గు.1.60), కొంత్త (కర్నూలు.117), మంద్ధి, వుంటుంద్ధి, జమాబంద్ధి, తదనంత్తరం, సంగ్గతి, పోయినంత్తలో, అవుతుంద్ధి, యెంద్దువల్లనంటే, చేసుకుంట్టా, రవంత్త, యండ్డదు, కొంచ్చెం, శంక్కరులు మొదలైనవి.

## 1.4. ద్విరుక్త ‘ళ’కారం ముందు బిందువు

కైఫియత్తులలోని కొన్ని పదాలలో మూర్ధన్య పార్శ్వికమైన ళకారం ద్విత్వ సహితమైనపుడు బిందుపూర్వకంగా ఉంది. ఉదా: కంళ్లు (శ్రీశైలం.3) వాంళ్ళు, దేవంళ్ళకు, పెంళ్ళాము మొదలైన రూపాలు కైఫీయత్తులలో కనిపిస్తున్నాయి.

## 1.5. ‘మ’కారానికి పర్యాయంగా బిందుపూర్వక ‘బ’కారం

కావ్యభాషలో ప్రత్యయ మువర్ణ స్థానంలో ద్విరుక్తి మకారంగాని, పూర్ణ బిందుపూర్వక బువర్ణంగాని పర్యాయంగా వస్తుంది.

ఉదా: వృక్షము, వృక్షమ్ము, వృక్షంబు. (బాల. తత్సమ.42) ఈ ధ్వని లక్షణమే సాంబ్రాజ్యము (గు. 1-57), (కర్నూలు. 50), జంబ్బిమాకు, జంబ్బిచెట్టు (క. 2-3) వర్ణంబులు( గు. 2-26) (ఈ పదం అన్ని చోట్ల ఈ విధంగానే ఉంది), యేతద్ధర్మణంబ్బులు శాసన స్తంభంబుల మీద (గు.4-27) అనే ఉదాహరణల్లో పదగతమైన మకారం దగ్గర కనిపిస్తోంది. (సామ్రాజ్యము, జమ్మిమాకు, జమ్మిచెట్టు). బిందుపూర్వక ‘బ’కు ‘మ’ తో యతిమైత్రి (బిందుయతి) చెల్లడంలోనూ ఈ ధ్వని లక్షణాన్ని సమన్వయించవచ్చు.

## 1.6. పదాంతంలో ‘ము’ ప్రత్యయం/పూర్ణబిందువుల పర్యాయత

పదాంతంలోని 'ము' ప్రత్యయగతమైన అచ్చు లోపించిన రూపం (సమయం), లోపించని రూపం (సమయము) రెండూ కైఫియత్తుల భాషలో ఉన్నాయి. ఉత్వం లోపించగా మిగిలిన మకారం లేఖనంలో పూర్ణబిందువు రూపంలో ఉంటుంది.
ఉదా: నిమిత్తము, తదనంతరం (పగో.16), గ్రామము, ప్రకారం (కృ. 3,4). కొంచ్చెం, గుండ్డం, దొరతనము, పట్నం, ప్రాకారము, పందుము, మంట్టపం, వాహనం మొదలైనవి.

## 1.7. వలపలగిలక

రేఫ మొదటి హల్లుగా ఉండి అన్యహల్లుతో కూడిన సంయుక్తాక్షరాన్ని (గర్వం) రాసేటప్పుడు అన్యహల్లును అచ్చుతో కలిపి ముందుగా రాసి తర్వాత రేఫను వలపలగిలకలా రాసే పద్ధతి (గర్వం) కైఫియత్తులలో నియతంగా ఉన్నట్లు కనిపిస్తుంది. ఈ లేఖన పద్ధతి సుమారుగా 20 వ శతాబ్ది ప్రారంభం వరకూ ఉంది.

ఉదా: విదర్భదేశం, ముత్తుర్జాంన్నగరు (విజయ.1), స్వర్గలోకం (విజయ.4), జమీందార్లు, కర్నల్ (పగో.27), అర్థవంత్తులు(గు.2.1), సామర్థ్యం(నె.116), పిడవర్తి(గు.1096-9 అముద్రితం), వార్తలు, గర్భితములు, దిగ్విజయార్థం మొదలైనవి.

## 1.8. 'ఇ/యి', 'ఎ/యె/య' ల పర్యాయత

పదాదిలో తాలవ్యాచులకు పూర్వ యకార సహిత తాలవ్యాచులకు భేదకత్వం లేదు. (ఇ/యి, ఎ/యె). కైఫియత్తుల భాషలో పదాదిలో తాలవ్యాచ్చులకు బదులు యకారసహిత తాలవ్యాచ్చులు (యి,యీ,యె, యేలు) నియతంగా కనిపిస్తున్నాయి.

ఉదా: యితణ్ని (నె.147), యివి (గు.2-23), యీ లాగున, యీశాన్యం (నె.139), యివ్వక, యిచ్చెను, యిచ్చుకుంటున్నాను మొదలైనవి. యెందుకు (నె.139), యేలూరు, యేనుగులు (పగో.20, 21), యేమంటె (కర్నూలు.146), యెత్తుకొని, యెక్కడెక్కడ, యెందువల్ల, యెవరు, యేమి, యేరు మొదలైనవి కూడా ఇందుకు ఉదాహరణలని చెప్పొచ్చు.

పదాదిలోని ఎకారానికి పూర్వయకార సహిత అకారంతో అభేదం కనిపిస్తుంది. (ఎ/య). పదాది యకారం మీది ఎకారానికి, అకారానికి భేదకత్వం పోవడం (యె/య) 12వ శతాబ్దం నుంచి కనిపిస్తోంది. ఈ వర్ణభేదకత్వ తటస్థీకరణ (Neutralization of Phonemic Contrast) పదమధ్యంలో కూడా 16వ శతాబ్ది నుంచి ఉంది. అకారం పరంగా ఉన్నప్పుడు ఎకారం అర్ధవివృతంగా వినిపిస్తుంది. ఈ కారణంచేత యల్ల (<యెల్ల< ఎల్ల),యాభై(<యేభై< ఏభై) వంటి రూపాలు ఏర్పడ్డాయి. (రంగనాథాచార్యులు. 2010:169).
ఉదా: యెన్ని (శ్రీ.19), యన్ని (శ్రీ.21), యాభై, యవరు (విజయ.4), యనిమిది, యడ్లు (గు.4-135), అవియయ్యవి(కొండవీడు.1096-9 అముద్రితం), యదురు, యత్రటి,(నె.162), యంత్త, యడల, యక్కడ, యండ్డదు, , యందుచాత, యన్నడు, యందుకు, యదుట, యరకపడకుండా, పాయను (పోయెను) మొదలైనవి.

## 1.9. ఉ/వు, ఒ/వొ/వ ల పర్యాయత

పదాదిలో ఓష్ఠ్యాచ్చులకు పూర్వవకార సహిత ఓష్ఠ్యాచ్చులకు భేదకత్వం లేదు (ఉ/వు, ఒ/వొ). కైఫియత్తుల భాషలో పదాదిలో ఓష్ఠ్యాచ్చులకు బదులు వకార సహిత ఓష్ఠ్యాచ్చులు (వు,వూ,వొ,వోలు) నియతంగా కనిపిస్తున్నాయి.

ఉదా: వుండి (పగో.12), వుదయాన (క.2-2), వూరు (గు.2-13), వుత్తరం (గు.2-17), వున్నట్లు, వుదకం, వున్నతమైన, వుత్సవం, వుద్భవించి మొదలైనవి. వొఖరు(చి.35), వొఖ(చొ.35) వొడలు, వొక్క, వొడ్డున, వోరుగల్లు (కర్నూలు.58), వోశాసనం( కర్నూలు.5) మొదలైనవి.

పదాదిలోని 'ఒ' కారానికి పూర్వ 'వ' కార సహిత 'అ' కారంతో అభేదం కనబడుతుంది (ఒ /వ). పదాది 'వ' కారం మీది 'ఒ' కారానికి 'అ' కారానికి భేదకత్వం పోవడం (వొ /వ) 17. వ శ. నుంచి కనిపిస్తోంది. (రంగనాథాచార్యులు.2010:170) ఇది వక (<వొక< ఒక)వంటి రూపాలలో కనబడుతుంది.

ఉదా: వక (ఒక) (నె. 107, కర్నూలు.52), వఖ (నిజయ.68) వకనాటి, వకడు, వకరు, వరంగల్లు మొదలైనవి.

**1.10. పద మధ్యంలో తాలవ్యాచ్చుకు ముందున్న 'య'కు, ఓష్ఠ్యాచ్చుకు ముందున్న 'వ'కు లోపం**

పదాదిలో ఇ/యి లకు, ఉ/వు లకు వచ్చిన అభేద లక్షణం పదమధ్యంలో కూడా కనిపిస్తుంది. లేఖనంలో ఒక పద్ధతి ఏర్పడకపోవడమే దీనికి కారణమనిపిస్తుంది. ఇది 17వశతాబ్ధి శాసనాలలో కూడా ఉంది. (రంగనాథాచార్యులు. 2010:170). శాసనాలలోనూ, కైఫియత్తులలోనూ ఒకే ఉదాహరణలుండడం గమనించదగింది.

ఉదా: అఇదు, చెరుఉ

**1.11. అ/ఒ ల పర్యాయత**

తాలవ్యాచ్చుకి ముందున్న కంఠ్యాచ్చుకు ఓష్ఠ్యాచ్చుకు అభేదం కనిపిస్తుంది. ఈ లక్షణం శాసనభాషలోనూ ఉంది. (రంగనాథాచార్యులు.2010:170).
ఉదా: తొవ్వించి (త) (కర్నూలు.46, చి.32), పాయను (పోయెను) (చో.31)

**1.12. 'అయి/ఐ' ల, 'అవు/ఔ' ల పర్యాయత**

తెలుగులో అయిదు, అవుడు వంటివి త్వరితోచ్చారణ చేత అయ్ దు, అవ్ డు వంటివిగా ఏర్పడతాయి. అయ్ అవ్ లు సంస్కృతంలో స్వతంత్ర వర్ణాలైన ఐ ఔ లతో అభేదతను పొందాయి. తెలుగు లేఖనంలో ఐదు ఔడు వంటి రూపాలుగా ప్రచారంలోకి వచ్చాయి. తెలుగులో ఈ పర్యాయత ప్రాఙ్నన్నయ కాలం నుంచి ఉండగా, ఇది తత్సమ పదాలలో 15వ శతాబ్ధి నుంచి వ్యాపించింది. కైఫియత్తుల భాషలో అన్ని పదాలూ అయి, అవులతోనే ఉన్నాయి. ఒక్క సంఖ్యావాచకాలలో ఇరవై, ముప్పై అని, కై అనే విభక్తి ప్రత్యయంలోనూ ఐ లేఖనంలో కనిపిస్తుంది. మౌజే, కౌలు అనే పదాలలో 'ఔ' కనిపిస్తుంది.

ఉదా: వగయిరా (శ్రీ.21), వయిఖానసుడు (గు.1-100), జయినులు (గు.2-23), వయిరానికి, వయిపు, వయినం, వయిద్యం, రయితులు, ఇరవై, యితరమయిన, కయిఫియ్యతు, కయింకర్యము, అవుతుంది మొదలైనవి.

### 1.13. 'స/శ', 'శె/శ', 'చే/శా', 'చా /శా' ల పర్యాయత

1. తాలవ్యాచ్చులకు ముందున్న దంతమూలీయ సకారానికి తాలవ్య శకార ఉచ్చారణ వచ్చింది. స శ లు రెండూ ఊష్మాలే. ఈ లక్షణం కైఫియత్తులలో విశేషంగా కనిపిస్తుంది.

ఉదా: స/శ – చెశి (గు.1-84), చేశిన (నె.141), చేశ్ని, వ్రాశి, సంన్యాశి, వెంచేశి, తీసి-తీశి, సీమ-శీమ, పోశి, వెలశినందున, మురిశిపోయినది, పారవేశెను, తెలిశెటట్లు, కోశెడు, శేవించి మొదలైనవి. కంఠ్యాచ్చు ముందున్న దంతమూలీయ సకారానికి కూడా తాలవ్య శ కారోచ్చారణ వచ్చింది.

ఉదా: శారాంశము (కర్నూలు.51)

2. ఇక్కడ తాలవ్య శకారం మీద ఎ/అ లకు భేదకత్వం పోవడం (శె/శ) మరొక అంశం.

ఉదా: శట్టి (శెట్టి), శావ (సేవ/శేవ), పదివీశల గంధం మొదలైనవి.

3. అలాగే ఊష్మాలైన చే/శా/శే ల మధ్య కూడా భేదకత్వం పోయింది.
ఉదా: యరికశాయగా (చే) (కర్నూలు.46), శేయుచుండగా (చే) (కర్నూలు.109), మనవిశాయగా మొదలైనవి.

4. అలాగే చా/శా ల మధ్య కూడా భేదకత్వం పోయింది.

ఉదా: శానావిశ్వాసం, శానాదినములు. ఇది 17వ శతాబ్దం నుంచి శాసనాలలో కనిపిస్తుంది. (రంగనాథాచార్యులు.2010:173).

### 1.14. 'ఉ/యు', 'ఒ/యొ', 'అ/ య' లకు అభేదం

ఇవి కావ్యభాషా ప్రభావంతో వచ్చిన యడాగమ రూపాలు అయి ఉంటాయి.

ఉదా: యుండిరి (ఉండిరి), యుమావల్లభ, యున్నది. యొక (ఒక). యాకారం(ఆకారం) (గు.2-17) మొదలైనవి.

### 1.15. దీర్ఘాలకు బదులు హ్రస్వాలు రాయడం

ఎకార ఒకారాల దీర్ఘాల్ని రాయవలసిన చోట హస్వాల్ని రాయడం కైఫియత్తుల భాషలో ఎక్కువగా ఉంది. ఇది ఉచ్చారణలో లేకుండా లేఖనంలో వచ్చిన ఒక ప్రత్యేక

లక్షణంగా గుర్తించాలి. ఇది దేశ్య తత్సమ భేదం లేకుండా అన్ని పదాలలోనూ కనిపిస్తుంది.

ఉదా: అనె, అనెక, చెసెను, సమెతులైన, నెను, చెసి, పెరు, చెత, తెనె, లెవు, లెకుండా, సెవిస్తూ, లెదు, యెది, బెరిజు, జరిప్పించెది, నాగెశ్వరుడు, వుండ్డెది, మున్నెవర్కు, ఛెదించి, క్షెత్రపాలకుడు, వెగెశ్వరస్వామి, వయ్యెరు, దెవాలయం, కెవలము, శ్రెయస్సు మొదలైనవి. కొనెరు, వెణుగొపాల, భొగెశ్వర మొదలైనవి.

ఈ విధంగా మరికొన్ని మార్పులూ ఉన్నాయి. వాటిలోనూ ఇదే విధమైన లేఖనా పద్ధతును భాషా స్వరూపాన్ని బట్టి గుర్తించవచ్చు.

==================================================================

**Referance Books**


1. కృష్ణమూర్తి, భద్రిరాజు. (సం.) 2010. **తెలుగుభాషా చరిత్ర.** హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

2. గోపాలకృష్ణారావు, కె. 1968. **తెలుగుపై ఉర్దూ పారశీకముల ప్రభావము**. హైదరాబాదు: ఆంధ్రసారస్వత పరిషత్తు.

3. గ్రామ కైఫితత్తులు (గుంటూరు జిల్లా). 2005. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్కైవ్స్.

4. మెకంజీ కైఫియత్తులు- కడపజిల్లా- 1. 2007. కడప: సి.పి. బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రం.

5. ------------ జిల్లా - 2.2006. కడప

6. ----------జిల్లా-3. 2007. కడప:

7. విజయనగరం జిల్లా కైఫియత్తులు. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్కైవ్స్.

8. విశాఖపట్నం జిల్లా గ్రామ కైఫియత్తులు. 1990. హైదరాబాదు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్కైవ్స్.

9. శ్రీకాకుళం జిల్లా గ్రామ కైఫియత్తులు. 1990. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్కైవ్స్.

10. శ్రీశైల దేవాలయ కైఫియత్తు – 2.1982. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

11. సుబ్రహ్మణ్యం, పి.యస్. 1997. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

12. సుబ్రహ్మణ్యం, శ్రీపాద. 2012. తెలుగులిపి ఆవిర్భావ వికాసాలు. హైదరాబాదు: ఎ.పి. ప్రాచ్యలిఖిత గ్రంథాలయం.

================================================================